క్లుప్తంగా

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని సంతోష్ నగర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలోని పలు చోట్ల శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల చేపట్టనున్న అభివృద్ధి పనుల కారణంగా సంతోష్ నగర్, మామిదాలపాడు, ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలు, బావాపురంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): క్షయవ్యాధితో బాధపడుతున్న పలువురు రోగులకు రోటరీ క్లబ్ కర్నూలు అధ్యక్షుడు డాక్టర్ సి.వాసురెడ్డి ఆహార ప్యాకెట్లు అందజేశారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ చేతుల మీదుగా ఆయన ఈ కార్యక్రమం నిర్వహించారు.

8న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 8వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్-19 విభాగంలో జిల్లా స్థాయి శాప్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ. రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి 94402 22232 నంబర్‌లోసంప్రదించాలని సూచించారు.

పోటీల్లో ప్రతిభ చాటాలి

శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి శాప్ వాలీబాల్ అండర్-21 యూత్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన సీఈఓ మాట్లాడారు.

అంతర్జాతీయ సైన్స్ క్విజ్ పోటీలు వాయిదా

కర్నూలు కల్చరల్: ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించాల్సిన అంతర్జాతీయ స్థాయి సైన్స్ క్విజ్ ఛాంపియన్‌షిప్ పోటీలను వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సంయుక్తంగా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు కృష్ణానగర్ రైల్వే గేట్ సమీపంలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 93968 61308 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ కె.శివప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(327) డైరీ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తేనే వినియోగదారుల మన్ననలు పొందుతామని, దీంతో సంస్థ లాభాల్లోకి వస్తుందన్నారు. ఆ సంఘం సంస్థ అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కారానికి అన్ని విధాల ముందుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, ఆ సంఘం సెక్రటరీ జనరల్ సాయి కృష్ణ, ఎంవీ రాఘవరెడ్డి, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీకాంతరెడ్డి, దామ్లా నాయక్ పాల్గొన్నారు.

18న 'లలిత సహస్రనామ కోటి పారాయణం'

కర్నూలు కల్చరల్: కల్లూరు అమ్మవారి శాల కల్యాణ మండపంలో ఈ నెల 8న నిర్వహించాల్సిన లలిత సహస్రనామ కోటి పారాయణం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు నిర్వాహకులు యోగా గురువు వుప్పేపల్లి పుల్లయ్య తెలిపారు. 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పారాయణం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కర్నూలు(రాజ్‌విహార్): వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని గూడ్స్ కార్మికుల విశ్రాంతి భవనంలో ఆ సంఘం కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ :అవతార్ ది వే ఆఫ్ వాటర్, 18 పేజెస్, ఒక్కడు, ధమాకా, మైఖేల్ గ్యాంగ్, కింగ్‌డమ్ ఆఫ్ ది డైనోసార్స్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : 18 పేజెస్, ఒక్కడు, అవతార్ ది వే ఆఫ్ వాటర్, కింగ్‌డమ్ ఆఫ్ ది డైనోసార్స్, ఏ జర్నీ టు కాశి, ధమాకా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ధమాకా, మైఖేల్ గ్యాంగ్, ఒక్కడు
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్
భరత్ కాంప్లెక్స్ : ఒక్కడు
రాజ్: ధమాకా
శ్రీరామ : ఒక్కడు
విజయ : 18 పేజెస్

సంక్షేమ సారథి జగనన్న

- పింఛన్ వారోత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య



లబ్ధిదారులకు కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న మేయర్ బి.వై.రామయ్య, ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీలో 36,37,41వ వార్డుల లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. వైఎస్సార్ పింఛన్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేశామన్నారు. మూడున్నరేళ్ల కాలంలో పెన్షన్ల కోసమే రూ. 62,500 కోట్లు వెచ్చించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులు, నాయకుల అండదండలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో లంచాలకు తావు లేకుండా అర్హత ప్రమాణికంగా సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రతి నెల 1వ తేదీనే అవ్వాతాతలకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. కర్నూలు నగరంలో మొత్తం 35 వేల పెన్షన్‌దారులు ఉన్నారని కొత్తగా 1,360 మందికి పెన్షన్ మంజూరయ్యాని పేర్కొన్నారు.

పేదొడికి ధనవంతులకు జరుగుతున్న యుద్ధమిది:

రాష్ట్రంలో నీతికి అవినీతికి, పేదొడికి ధనవంతుడి మధ్య జరుగుతున్న యుద్ధమని ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య అన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక టీడీపీ అసత్యా ఆరోపణలు చేస్తోందన్నారు. ఎల్లో మీడియాను అడంపెట్టుకొని ఎలాగైన అధికారంలోకి రావాలని చూస్తున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు అయేషా సిద్ధిఖా, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, 21వ వార్డు ఇన్‌చార్జ్ బాల చంద్రారెడ్డి, 36వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఖర్చులు తగ్గించండి.. ఆదాయం పెంచండి
- బిల్లుల వసూలులో లక్ష్యం సాధించండి
- ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టరు శివప్రసాద్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో కర్నూలు సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ, డీఈలు, ఏడీఈలు, అకౌంట్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ వారీగా పురోగతి, వైఫల్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగ్గట్లు పని చేయాలని ఆదేశించారు. వృథా ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించడంతో పాటు ఇతర ఖర్చులను నియంత్రించాలన్నారు. నెలవారీ విద్యుత్ బిల్లులను వంద శాతం వసూలు చేసి పురోగతి చూపాలని, స్పాట్ బిల్లింగ్‌ను ప్రతి నెలా 10వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. వినియోగదారులకు ఇచ్చిన గడువులోపు బిల్లులను రాబట్టాలన్నారు. వీటితో పాటు సంస్థకు భారంగా మారిన పాతబకాయిలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంస్థకు బకాయిలుగా ఉన్న పది మంది డీఫాల్టర్ల వివరాలను సెక్షన్ కార్యాలయాలతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని, దీంతో ఎవరు ఎంత బకాయి ఉన్నరన్నది అందరికీ తెలుస్తుందని వెల్లడించారు. మొండి బకాయిలు వసూలు కావని నిర్ధారణకు వస్తే ఆర్ ఆర్ యాక్టు ద్వారా రెవెన్యూ రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గాలి, ఇతర కారణాలతో ఏర్పడే బ్రేక్ డౌన్స్, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించాలన్నారు. కొత్త కనెక్షన్లు మంజూ రు చేయడంలో జాప్యం చేయరాదని, మంజూరైన పనులు వేగవంతంగా పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు క్లోజ్ చే యాలని ఆదేశించారు. సబ్‌సేషన్ల పర్యవేక్షణ, నిర్వహణ ఎంతో ముఖ్యమని, అప్పుడే అంతరాయం సమస్యలు తగ్గుతాయని చెప్పారు. సమావేశంలో ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, ఆపరేషన్స్ ఈఈలు రమేష్, శ్రీనివాసబాబు, సుధాకర్ కుమార్, రమణారెడ్డి, రాజేష్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ అన్వర్ బాషా, ఏడీఈలు, ఏఈలు, ఏఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

- అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కర్నూలు

కర్నూలు (టౌన్): క్రీడలకు రాష్ట్రం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడల్లో రాణించేందుకు క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) లీగ్ అథ్లెటిక్స్ పురుషుల, మహిళల క్రీడా పోటీలు నిర్వహించారు. 2వ రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్లు 27 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ..క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల నిర్వహణలో శాప్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. క్రీడాకారుల సంక్షేమం కోసం పాటుపడుతున్న న్యాయవాది శ్రీధర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా పోటీల వల్ల క్రీడాకారుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు, ఆదరణ లభిస్తుందని చెప్పారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ మాట్లాడుతూ.. శాప్ లీగ్ అథ్లెటిక్స్ పోటీలకు మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

-100 మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో.. ఎం. కిషోర్ (మొదటి స్థానం), మహిళల విభాగంలో బి.దీపిక (మొదటి స్థానం), పురుషుల లాంగ్ జంప్ విభాగంలో కె.వీరనాగన్న (మొదటి స్థానం), మహిళల విభాగంలో సి.దేవి (మొదటి స్థానం)
-1500 మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో ఎస్.షేక్షావలి (మొదటి స్థానం), మహిళల విభాగంలో వి.భార్గవి (మొదటి స్థానం)
- 21 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్ (పురుషులు) 13 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్ (మహిళలు)

స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎంపై వేటు

కర్నూలు సిటీ: ఆదోని మండలం కపటి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా పని చేస్తున్న డి.వెంకటేశ్వర్లును శుక్రవారం సస్పెండ్ చేస్తూ డీఈఓ డా.వి రంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. స్కూల్‌లో రెగ్యులర్‌గా విధుల నిర్వహణ లేకపోవడం, తరుచుగా ఆ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో తగాదాలు పడడంతో పాటు, స్కూల్లో చదువుతున్న పిల్లల పేరెంట్స్‌తో కూడా సక్రమంగా ప్రవర్తించడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 4న డీఈఓ స్వయంగా స్కూల్‌ను విజిట్ చేసి అక్కడి పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించాలని ఆదేశాలు ఇచ్చినా కూడా సదరు హెచ్‌ఎం ఒక్క విద్యార్థికీ కూడా ట్యాబ్‌లు ఇవ్వకపోవడం, తదితర ఫిర్యాదులతోనే హెచ్‌ఎంను సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): దేశంలో నిత్యం మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలులోని 43, 45, 48వ వార్డుల పరిధిలో ఐద్వా జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో హత్యలు, అత్యాచారాలు అధికమవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనతతో నేరస్తులకు శిక్షలు పడడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐఎన్‌టీయూసీ సమావేశం వాయిదా

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 6వ తేదీన జరగాల్సిన కర్నూలు, నంద్యాల జిల్లాల ఐఎన్‌టీయూసీ ఉమ్మడి సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బతుకన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు సమావేశాన్ని నిర్వహిస్తామనేదానిపై త్వరలోనే తెలియజేస్తామని ఆయన వివరించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు (టౌన్): కోవిడ్ సమయంలో పనిచేసిన కార్మికులను విధుల్లోకి చేర్చుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, చెన్నయ్య పాల్గొన్నారు.

ఒప్పందం ప్రకారం జీతాలు చెల్లించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఒప్పందం ప్రకారం జీతాలు చెల్లించాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ్ కోరారు. సీఐటీయూ నగర నాయకుడు రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులతో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.కృష్ణ, మహమ్మద్, కేవీపీఎస్ నాయకుడు కృష్ణ పాల్గొన్నారు.

వయసు వెసులుబాటు కల్పించండి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ పరీక్షలు (గ్రూప్ 1, 2), ఇతర ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలు రాసే దళిత, గిరిజనులకు వయసు వెసులుబాటు కల్పించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వై రాజు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యాట ఓబులేసు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఏపీపీఎస్సీ సభ్యులు పీ సుధీర్‌ను వారు శాలువా కప్పి సన్మానించారు. అలాగే రూల్ ఆఫ్ రిజర్వేషన్ సక్రమంగా అమలయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో విజయకుమార్, పవన్, రాజేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్ర కాలేజీ వార్షికోత్సవం

కర్నూలు సిటీ: రవీంద్ర మహిళా డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం శుక్రవారం ఆ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. రవీంద్ర విద్యా సంస్థల అకడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ ప్లేస్మెంట్ సెల్ డీన్ డా.జశ్వీందర్ కౌర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

డీవైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): డీవైఎఫ్ఐ రూపొందించిన క్యాలెండర్‌ను గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ ఆవిష్కరించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.నగేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

భక్తిశ్రద్ధలతో మహారుద్రాభిషేకం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర పురోహిత సంఘం, అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఓల్డ్‌సిటీలోని శంకర మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్య శుద్ధ పూర్ణిమ ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారికి 121 మంది పురోహితులచే మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాన్ని 1331 సార్లు నిర్వహించారు. అనంతరం అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం వారు భక్తులు, పురోహితులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

కల్లూరు: దేశంలో ఎక్కడాలేని విధంగా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు 80వ వార్డు సచివాలయం పరిధిలోని శర్మనగర్, వాసవి దేవాలయ పరిసర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ... ముఖ్యమంత్రి చిత్రంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సర్కారును ఆశీర్వదించాలన్నారు. నాటి చంద్రబాబు పాలనను నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని తేడను గమనించాలన్నారు. అప్పట్లో ప్రభుత్వ పథకాలు పేదలకు అందేవి కావన్నారు. ఇప్పుడు ఇంటికొచ్చి పథకాలు అందజేస్తున్నారన్నారు. ఇది వరకులాగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల ప్రభుత్వ సేవలను స్థానికంగా ఉన్న సచివాలయ వ్యవస్థ ద్వారా సత్వరం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, సంగాల సుదర్శన్‌రెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, కాశపోగు జయరాముడు, ఇప్పల నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, 21వ వార్డు ఇన్‌చార్జ్ బాల చంద్రారెడ్డి, 35వ వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య, 30వ వార్డు ఇన్‌చార్జ్ సంజన్న, రంగప్ప, పెద్దన్న, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కొత్త పెన్షన్లు అందజేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వివక్ష, లంచాలకు తావు లేని ప్రభుత్వం మాది
- పెన్షన్ వారోత్సవాల్లో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ' గత ప్రభుత్వాల హయాంలో పెన్షన్ కోసం లబ్ధిదారులు పడిగాపులు కాసేవారని, వృద్ధులు, వికలాంగులు కార్యాలయాల చుట్టూ తిరిగి తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిందని, వలంటీర్లు ప్రతి నెలా ఒకటోవ తేదీనే ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులకు ఠంచన్‌గా పెన్షన్ అందిస్తున్నారని' కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. వివక్ష, లంచాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 44వ వార్డు పరిధిలోని రామలింగేశ్వర్ నగర్ పార్కు వద్ద డాక్టర్ వైఎస్ఆర్ పెన్షన్ పెంపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని గత ప్రభుత్వం పెన్షన్ల విషయంలో అనవసరమైన రాద్ధాంతం చేస్తోందన్నారు. అధికారం కోసం గుంటనక్కల వేచి చూస్తోందని విమర్శించారు. తమ ప్రభుత్వంలో అనర్హుల విషయంలో కొంత మంది పెన్షన్ తొలగించినా... అర్హత ఉన్న వారందరికి పెన్షన్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల పరిస్థితి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెన్షన్ల పరిస్థితి ఏ విధంగా ఉందో ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి, మెప్మా సిబ్బంది సుధాకర్, నగేష్, అశోక్, రీసోర్స్ పర్సన్లు, 42 వార్డు ఇన్‌చార్జ్ కార్పొరేటర్ శ్వేతారెడ్డి, 44వ వార్డు కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, 46 నగరూరు శ్రీనివాసరావు, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ సెల్ సభ్యులు ప్రభుదాస్, రైల్వే ప్రసాద్, ఆది మోహన్‌రెడ్డి, జమ్మన్న, వాహీద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు తప్పక వేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరును వేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. శుక్రవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర చిహ్నాలు ఉన్న గర్భవతులను గుర్తించి ప్రసవానికి వారం ముందే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. ఆశ, ఏఎన్ఎంలు వారికి అందుబాటులో ఉంటూ సుఖప్రసవం అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వంద శాతం అందించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వేలో భాగంగా ప్రతి ఆరోగ్య కార్యకర్త రోజుకు 20 హెల్త్ ఐడీలు జనరేట్ అయ్యేటట్లు చూడాలని సూచించారు. సమావేశంలో డీపీఎంవో డాక్టర్ ఉమ, డీఏవో శర్మ, డీపీవో విజయరాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరు లక్షల ఇంటి స్థలమిచ్చారు

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో మహిళ గుంత ఇందిరా
- పెద్ద పడఖానలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పెద్దపడఖానా ప్రాంతంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): 'మాకు సొంతిల్లు లేదు. బాడుగింట్ల ఉంటున్నాం. గింత స్థలం తీస్కుందామన్నా దుడ్లు లేవు. స్థలం, ఇల్లు కావాలని గత ప్రభుత్వాల సమయంలో శానా మందికి అడిగినా. అందరి సుట్టూ తిరిగినా. ఐనా ఎవరూ ఇయ్యలే. కానీ జగనన్న సీఎం అయినాక ఆరు లక్షల రూపాయల స్థలమిచ్చినాడు. ఎక్కడికి పోకున్నా వలంటీర్ ఇంటి కాడికి వచ్చి.. అవ్వా మీకు సొంతిల్లు లేదు కదా.. పేరు చెప్తే రాసుకుంటా అని ఆధార్ కార్డు తీస్కోని రాసి పంపినాడు. ఇంటి స్థలం మంజూరు అయ్యింది. మూడేళ్లలో ఇంకా పింఛన్‌కు రూ.82వేలు, సున్నా వడ్డీ కింద రూ.4,440, అమ్మ ఒడి కింద రూ.29వేలు మొత్తం రూ.1,15,440 నా బ్యాంకులో ఏసినాడు అంటూ' ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్ ముందు ఆనందాన్ని వ్యక్తం చేసింది గుంత ఇందిరా. శుక్రవారం ఎమ్మెల్యే 8వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పెద్ద పడఖానలో వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి స్థలం ఇచ్చి సొంతిల్లు నిర్మించాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని, ఆయన తెచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు, సెక్రటరీలు సర్వేలు చేసి అర్హులైన వారు అడగకపోయినా పథకాలకు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. దీంతో ఎవరి చుట్టూ తిరక్కపోయినా అనేక మందికి సంక్షేమ పథకాలు మంజూరు అయ్యాయని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు అబ్రార్, పార్టీ నాయకులు అనిల్‌కుమార్, షాకీర్, ఫారూక్, యూసుఫ్, బాసిత్, శ్రీను, ముస్తాక్, ఇమ్రాన్ అలీ, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విప్లవం తెచ్చిన జగనన్న

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఉద్యోగ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి చరిత్ర సృష్టించారని అన్నారు. ఆయన పాలనకు మద్దతుగా తమ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, పార్టీ నాయకులు కుమారస్వామి రెడ్డి, మద్దయ్య, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21న విజయవాడలో షూటింగ్ బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా మైదానంలో ఈనెల 21 న అండర్-21 విభాగంలో రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శాప్ ఎండీ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈనెల 29 న అండర్-17 విభాగంలో బాపట్ల జిల్లా పిట్టవారిపాలెం పట్టణంలో రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన జట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్ నాయుడు 9989982655 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.